







చిరుత పాదముద్రలను సేకరిస్తున్న అటవీ అధికారులు

కోలూర్ గ్రామ శివారులో చిరుత సంచారం

తానూర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలూర్ గ్రామ శివారు సాతోబా గుట్ట పరిసరాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్లు స్థానికులు గమనించారు. ఈ విషయాన్ని గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా.. అటవీశాఖ అధికారి వేణుగోపాల్, సిబ్బంది పులి సంచరిస్తున్న ప్రాంతానికి వెళ్లి గమనించగా చిరుతపులి పాద ముద్రలు కనిపించాయి. ఆ పాదముద్రలను సేకరించి చిరుత సంచరిస్తుందని గుర్తించారు. రైతులు తమ చేన్లోకి ఒంటరిగా వెళ్లకుండా గుంపులుగా వెళ్లాలన్నారు. చిరుత సంచారించడం వలన గ్రామస్థులు ముందు జాగ్రత్తగా ఉండాలన్నారు. చేన్లోకి వెళ్లేటప్పుడు టార్చ్‌లైటు, కట్టెను చేతిలో ఉంచుకోవాలని, గుంపులుగా వెళ్లాలని, ఏదైనా అటవీశాఖ అధికారుల కు సమాచారం అందించాలన్నారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ కృష్ణ, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

తాగునీటి కోసం రాస్తారోకో

ముథోల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తరోడ ఎస్సీ కాలనీలో గత కొన్ని రోజుల నుంచి బోరు చెడిపోవడంతో తాగునీరు రావడం లేదు. దీంతో కాలనీ వాసులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించారు. పట్టించుకోకపోవడంతో శనివారం ఖాళీ బిందెలతో భైంసా- నిజామాబాద్ జాతీయ రహదారిపైన రాస్తారోకోకు దిగారు. 30నిమిషాల పాటు రాస్తారోకో చేయడంతో భారీ ఎత్తున ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని కాలనీవాసులను సముదాయించారు. ఈ విషయమై సంబంధిత అధికారుల కు తెలియజేస్తామని చెప్పడంతో శాంతించారు. వెంటనే ఎంపీడీవో శివకుమార్ గ్రామానికి చేరుకొని మోటార్‌కు మరమ్మతులు చేయించడంతో సమస్య పరిష్కారమైంది.



• జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన కడెం ప్రాజెక్టు ఇదే.

ప్రతియేటా వర్షాకాలంలో.. ప్రమాద ఘంటిక లు మోగిస్తూ.. ఏ సమయంలోనైనా కొట్టుకుపోయే పరిస్థితులను సూచించే కడెం ప్రాజెక్టును రక్షించేందు కోసం సంబంధిత అధికారులు నడుం భిగించారు. గత మూడు నాలుగు సంవత్సరాల నుంచి వర్షకాలంలో పెద్దఎత్తున వరద నీరు కడెం ప్రాజెక్టులోకి తరలి వస్తుండడంతో ఈ ప్రాజెక్టుకు ప్రమాద పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

వరద ముప్పునకు.. ముందస్తు ప్రణాళిక

- జిల్లాలోని కడెం పరిధిలో అంతా అప్రమత్తం
- వరద అంచనాపై యాక్షన్ ప్లాన్
- లోతట్టు ప్రాంతాల్లో కొత్తగా అలారంల ఏర్పాటు
- రంగంలోకి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు
- ప్రాజెక్టులో పూర్తయిన మాక్ డ్రిల్

నిర్మల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కడెం ప్రాజెక్టు వద్ద మొన్నటి వరకు సరియైన మరమ్మతులు లేకపోవడం, గేట్లు ఎత్తలేని పరిస్థితులు ఏర్పడడంతో వరద నీరు ప్రాజెక్టును ముంచెత్తే పరిస్థితి ఏర్పడింది. వరద ఉధృతికి కౌంట ర్‌వేట్‌లు, గేట్లు సైతం కొట్టుకుపోవడమే కాకుండా.. ఇతర రకాల నష్టం సంభవించింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఆశించిన మేరకు నిధులు విడుదల చేసి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టింది. అధికారులు దగ్గరుండి గడువులోగా పనులన్నింటిని పూర్తిచేయడంతో ఈసారి కడెం ప్రాజెక్టుకు వరదముప్పు తప్పినట్టేనని అంటున్నారు. ఎగువ నుంచి వచ్చే వరదను ఎప్పటికప్పుడు అంచనా వేసి వీటికి అనుగుణంగా గేట్లను పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేయడం, అలాగే దిగువ పరివాహక ప్రాంతాలను అప్రమత్తం చేసేందుకు ప్రత్యేకంగా అలారంలు ఏర్పాటు చేయడం లాంటి ప్రక్రియను పూర్తి చేశారు. ఈసారి వరద అంచనాను లెక్కగడుతూ పంటలకు నీరు విడుదల చేసేందుకు కూడా అధికారులు సిద్ధమయ్యారు. దీంతో పాటు వరదల సమయంలో ప్రజలను కాపాడేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సైతం రంగంలోకి దించుతున్నారు. శనివారం కడెం ప్రాజెక్టులో ఎన్‌డీఆర్‌ఎఫ్ నిర్వహించిన విన్యాసాలను జిల్లా కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించారు. అలాగే ప్రాజెక్టులో ఆమె బోటింగ్ చేసి ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి మనోధైర్యం కల్పించారు.

వరద అంచనాకు సాంకేతిక చర్యలు

ప్రతియేటా కడెం ప్రాజెక్టుకు ముప్పుగా మారుతున్న వరద ఉధృతిని తెలుసుకునే అవకాశం లేకపోవడంతో ఇటు ప్రాజెక్టును.. అటు లోతట్టు గ్రామాలను ముంచెత్తుతుండడం సహజంగా మారింది. ఎగువ నుంచి వచ్చే వరద ప్రవాహాన్ని శాస్త్రీయంగా అంచనా వేసే అవకాశం లేకపోవడం కూడా ఈ ప్రాజెక్టుకు సమస్యగా మారింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వరద ఉధృతిని లెక్క కట్టేందు కోసం శాస్త్రీయ, సాంకేతిక పరమైన చర్యలను తీసుకుంది. ఎగువ నుండి వచ్చే వరదలు ఎప్పటికప్పుడు అంచనా వేసేందు కోసం సంబంధిత అధికారులు నాలుగు చోట్ల రెయిన్ ఫాల్ గేజ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. దీంతో పాటు అవసరమైన చోట్ల సెన్సార్లను కూడా ఏర్పాటు చేశారు. వీటి ఆధారంగా ఎగువ నుంచి వచ్చే వరదను ఎప్పటికప్పుడు లెక్క కట్టే అవకాశం ఏర్పడింది. దీంతో వరదఉధృతిని పక్కాగా లెక్కగట్టి దానికి అనుగుణంగా గేట్లను పైకెత్తుతే దిగువకు నీరును విడుదల చేయనున్నారు. మొన్నటి వరకు ఈ స్టేషన్‌లు లేని కారణంగానే అధికారులు వరద ఉధృతిని కరెక్ట్‌గా అంచనా వేయలేకపోయారు. ప్రస్తుతం మందపల్లి వద్ద గల పలికేరు వారు పైన, కడెం నది తాటిగూడ వద్ద, చిక్‌మాన్ వాగు వద్ద, అలాగే కుప్టి వాగు వద్ద ఈ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఈ నాలుగు ప్రాంతాల నుంచే రిజర్వాయర్‌లోకి పెద్దమొత్తంలో వరద నీరు ప్రవహిస్తుంటుంది. అధికారులు గేజింగ్ స్టేషన్లకు సెన్సార్లను అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు వరద ఉధృతిని తెలుసుకుంటూ ఆ ఉధృతికి అనుగుణంగా ప్రాజెక్టు గేట్లను పైకెత్తి దిగువకు నీటిని వదలనున్నారు. ఇప్పటి మాదిరే గత ఎండాకాలంలో కూడా ఇక్కడి ప్రాజెక్టు అధికారులు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకుని ప్రాజెక్టు గేట్లు పైకి ఎత్తే అంశంపైనే దృష్టి సారించారు. దీని కారణంగానే గత సంవత్సరం ఎగువ నుంచి ఒక్కసారి ప్రాజెక్టులోకి దాదాపు రెండున్నర లక్షల క్యూసెక్కులకు పైగా ఇన్ ఫ్లో కొనసాగింది. అయితే అధికారులు ఏర్పాటు చేసిన రెయిన్ గేజ్ స్టేషన్లు, సెన్సార్ల ద్వారా వరదను తెలుసుకుంటూ దిగువకు 2లక్షల 78 వేల క్యూసెక్కులకు పైగా నీటిని వదిలారు. దాదాపు ఐదు గంటలకు పైగా ఎగువ నుంచి వరద ఇదే ఉధృతితో కొనసాగినప్పటికీ రెయిన్ గేజింట్ స్టేషన్లు, సెన్సార్ల ద్వారా అధికారులంతా సమన్వయంగా వ్యవహరించి సక్సెస్ ఫుల్‌గా దిగువకు నీరును వదలగలిగారు. ఈసారి కూడా ఇదే యాక్షన్ ప్లాన్‌ను మరింత పకడ్బందీగా అమలు చేయబోతున్నారు.

అలారంతో 14 గ్రామాలు అప్రమత్తం

కడెం ప్రాజెక్టు దిగువన ఉన్న 14 లోతట్టు గ్రామాలకు ప్రతియేటా ఈ ప్రాజెక్టు నుంచి వర్షాకాలం వరదముప్పు ఏర్పడుతోంది. ఎగువ నుంచి వరద ఉధృతి పెరగడంతో ప్రాజెక్టు గేట్లు ఎప్పటికప్పుడు పైకెత్తి ఆ వరద నీటిని దిగువకు విడుదల చేస్తుంటారు. దీని కారణంగా లోతట్టు ప్రాంతాలకు ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహ సమాచారాన్ని తెలుపడం అధికారులకు కత్తి మీద సాములా మారింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు 14 లోతట్టు గ్రామాల్లో వరద హెచ్చరికలకు సంబంధించిన అలారంలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయబోతున్నారు. ఇప్పటికే అలారంల ఏర్పాటుకు సంబంధించి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సమీక్ష సమావేశం నిర్వహించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసే సమయాని కన్నా ముందుగానే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా అలారంలను గ్రామాల్లో మోగించనున్నారు. దీంతో అలారం మోగగానే గోదావరి నది వైపు పశువుల కాపరులు, సాధారణ ప్రజలు వెళ్ల కూడదంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేయనున్నారు. అంతేకాకుండా అలారం మోత కారణంగా వరద విపత్తుల గురించి ప్రజలకు ముందస్తు సమాచా రం అందుతుంది. దీంతో వరద ప్రమాదాలు తగ్గే అవకాశం ఏర్పడనుందని అధికారులు చెబుతున్నారు.



• కడెం ప్రాజెక్టులో ఎయిర్ బోట్‌పై ప్రయాణిస్తున్న కలెక్టర్

రంగంలోకి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

ఎన్‌డీఆర్‌ఎఫ్ కింద ఇప్పటికే జిల్లాలో 70 మంది పోలీసులకు ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో వరద విపత్తులను ఎదుర్కోవడంపై శిక్షణ పూర్తి చేశారు. అలాగే మరో 150మంది పోలీసులకు కూడా వరద విపత్తులపై శిక్షణను మొదలుపెట్టనున్నారు. అయితే ఈ ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు కడెం ప్రాజెక్టు వరదల పైనే కాకుండా స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టులు, భారీ చెరువుల వరదల సమయంలో కూడా రక్షణ చర్యలను చేపట్టనున్నారు. కాగా వరద విపత్తులను ఎదుర్కొనేందుకు పోలీసుల ఆధ్వర్యంలో ఎయిర్‌బోట్స్, లైవ్ జాకెట్స్, ట్యూబ్స్ రూప్స్ లాంటి పరికరాలన్నింటిని పోలీస్ శాఖ ఇప్పటికే సిద్ధం చేసింది. అలాగే పోలీస్ స్టేషన్లతో పాటు రెవెన్యూ ఆఫీసలలో హెల్ప్ డెస్క్‌ను, టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే ఇటీవల ఏర్పాటు చేసిన శివంగి టీంలను కూడా అవసరమైతే రంగంలోకి దించేందుకు పోలీస్ శాఖ సిద్ధమవుతోంది.

జిల్లాలో విస్తారంగా వర్షాలు



కడెం ప్రాజెక్టు వరదగేట్లు ఎత్తి దిగువన గోదావరిలోకి నీటిని వదులుతున్న దృశ్యం



భైంసాలో పంటచేలలో నిలిచిన వర్షపు నీరు



ఆలయంపై పడ్డ భారీ వృక్షం

- క్రమేపి ప్రాజెక్టుల వైపు కదులుతున్న జలధార
- కడెంలోకి భారీగా చేరుతున్న వరద నీరు
- రెండు గేట్లు ఎత్తివేత
- జిల్లా వ్యాప్తంగా 18 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

నిర్మల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇన్నాళ్లు సరైన వర్షాలు లేక ఇబ్బందులు పడ్డ రైతన్న కళ్లల్లో వరుణుడి రాక సంతోషాన్ని నింపింది. నిన్న మొన్నటి వరకు అడుగంటిన నీటి మట్టాలతో వెలవెలబోతూ కనిపించిన ప్రాజెక్టుల వైపు జలధార క్రమేపి కదులుతోంది. జిల్లాలో కడెం, స్వర్ణ, గడ్డెన్న వాగు మూడు సాగునీటి ప్రాజెక్టులు ఉండగా ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షాలకు కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మిగతా రెండు ప్రాజెక్టులైన స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టులకు ఇంకా ఆశించిన స్థాయిలో వరద నీరు రావడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటలకు ప్రాణం పోశాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కడెం ప్రాజెక్టులోకి చేరుతున్న వరద నీరు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 700ల అడుగులు కాగా ప్రస్తుతం 695.150 అడుగులకు చేరింది. ప్రాజెక్టులో పూర్తిసాయి నీటి నిల్వ సామర్థ్యం 4.699 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.54 టీఎంసీల నీరు ప్రాజెక్టులో నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి శనివారం 10400ల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో కడెం ప్రాజెక్టు రెండు వరద గేట్లను ఎత్తి దిగువన గోదావరిలోకి 9272 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. వర్షాలు భారీగా కురుస్తున్న నేపథ్యంలో కడెం ప్రాజెక్టు దిగువన గల గోదావరి నది పరివాహక ప్రాంతంలోకి ఎవరు వెళ్లవద్దని అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. జిల్లాలోని రెండు సాగునీటి ప్రాజెక్టులైన స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టులకు ఆశించిన స్థాయిలో వరద నీరు చేరడం లేదు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఉన్న మహారాష్ట్ర రాష్ట్రంలో కురిసే వర్షాలపైనే ఈ ప్రాజెక్టులు ఆధారపడాల్సి ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నప్పటికీ కేవలం స్వర్ణ ప్రాజెక్టులోకి గడిచిన 24 గంటల్లో 328 క్యూసెక్కుల వరద నీరు మాత్రమే వచ్చి చేరింది. స్వర్ణ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 360.56 మీటర్లు కాగా ప్రస్తుత నీటి మట్టం 358.69 ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. స్వర్ణ ప్రాజెక్టు పూర్తి నీటినిలో సామర్థ్యం 1.037 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 0.524 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు చెబుతున్నారు. స్వర్ణ ప్రాజెక్టు కింద ఆయకట్టు 8945 ఎకరాలు ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. గడ్డెన్న వాగు ప్రాజెక్టు కింద ఆయకట్టు 13,950 ఎకరాలు ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టులో పూర్తిస్థాయిలో సాగులోకి రావాలంటే ఎగువన ఉన్న మహారాష్ట్రలో వర్షాలు విస్తారంగా కురిసి ప్రాజెక్టులు నిండాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

18.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

జిల్లావ్యాప్తంగా శనివారం విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈ వర్షాలకు జిల్లాలో 18.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. జిల్లాలో అత్యధికంగా ముథోల్ మండలంలో 33.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. మరిన్ని వర్షాలు కురిసి కుంటలు, చెరువులు నిండాలని రైతులు కోరుతున్నారు.

భైంసా : డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వేళ వరకు భారీ వర్షం కురిసింది. పంటల పైర్లు నీట మునిగాయి. ప్రధానంగా సోయ, పత్తి చేలలో అధిక మొత్తంలో వర్షపు నీరు నిలిచింది. వివిధ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి చిన్నపాటి చెరువులను తలపించాయి.

దస్తురాబాద్ : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రంలోని రామ మందిర్ వద్ద ఉన్న భారీ వృక్షం వేళ్లతో సహా ఆలయంపై పడింది. దీంతో ఆలయం పాక్షికంగా దెబ్బతిన్నది.భక్తులు ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



సంఘ రాములు (ఫైల్‌ఫొటో)

ఖానాపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుర్జాపూర్‌లో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. సుర్జాపూర్ గ్రామానికి చెందిన సంఘ రాములు(65) అనే రైతు గత కొన్ని సంవత్సరాలుగా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. అప్పుల భారాన్ని తాళలేక ఇటీవల తనకున్న ఓ ప్లాటును సైతం విక్రయించి కొంత మేరకు అప్పు తీర్చారు. అయినప్పటికీ ఇంకా రూ. 20 లక్షల వరకు అప్పులు ఉండడంతో రాములు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శనివారం ఉదయం 5 గంటల సమయంలో పొలంలోని మంచె గుంజకు నైలాన్ తాడుతో ఉరి వేసుకుని కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటుగా వచ్చిన చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఐదు నెలల క్రితమే రాములు భార్య యశోద మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఓ పక్క భార్య మృతి మరోపక్క అప్పుల బాధ రెండింటితో తీవ్ర మనోవేదనకు గురైన రాములు ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు.ఘటన స్థలాన్ని ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. రాములుకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మత్తుపదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కుంటాల, జూలై, 26 : (ఆంధ్రజ్యోతి) : కిరాణా దుకాణాలతో పాటు మత్తు పదార్థాలు విక్రయించకూడదని, అలా విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్సై అశోక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కుంటాలతో పాటు కల్లూరు తదితర గ్రామాలలో కిరాణ దుకాణాలు, పాన్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. దుకాణం యజమానులు ఎటువంటి మత్తు పదార్థాలు విక్రయించినా దుకాణం సీజ్ చేస్తామని, యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మత్తుపదార్థాలు విక్రయించవద్దన్నారు.

నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం అత్యవసరం

• ఏఎస్పీ రాజేష్ మీనా • నిర్మల్ పలుచోట్ల 'కమ్యూనిటీ కాంటాక్ట్'



కాలనీవాసులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా

నిర్మల్ రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్య అత్యవసరమని ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్ అన్నారు. పట్టణంలోని మహాలక్ష్మి వాడ, డబుల్ బెడ్ రూమ్స్ ప్రాంతంలో శనివారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్ మాట్లాడుతూ... సైబర్ నేరాలు, నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, మద్యం సేవనం, మైనర్ల చేత వాహనాలు నడపడం వంటి సామాజిక మలినతలపై విఫలంగా వివరణ ఇచ్చారు. అలాగే ఆస్తి సంబంధ నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం అని స్పష్టంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనుమతులు లేకుండా నడుపుతున్న (70) ద్విచక్ర వాహనాలు, (03) ఆటోమొబైల్ వాహనాలు స్వాధీనం చేసుకొని సంబంధిత నిబంధనల ప్రకారం జరిమానాలు విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ నూతన రేషన్‌కార్డులు

• జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

కడెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ రేషన్‌కార్డులు అందజేస్తామని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం కడెం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ప్రత్యేక అధికారి హరికిరణ్‌తో కలిసి కలెక్టర్ అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలు అన్నింటికి రేషన్‌కార్డులే ప్రామాణికం అని, గత కొద్ది రోజులుగా నూతన రేషన్ కార్డులు అందకపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన రేషన్ కార్డుల ద్వారా ప్రజలందరికీ ఆరుకిలోల చొప్పున రేషన్ దుకాణాల ద్వారా ఉచిత సన్న బియ్యం అందుతాయని చెప్పారు. కడెం మండలంలో 966 నూతన రేషన్ కార్డులు మంజూరయ్యాయని అన్నారు. రెండు వేలకు పైగా రేషన్ కార్డులలో పేర్లు చేర్పడం జరిగిందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ... గత కొన్నేళ్లుగా ప్రజలకు నూతన రేషన్ కార్డులు లేక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారని చెప్పారు. ఖానాపూర్ నియోజకవర్గంలో దాదాపు 20 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరిందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పడిగెల భూమన్న, భూషణ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ, రేషన్ కార్డుల లబ్ధిదారులు, రేషన్ డీలర్లు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంపై దృష్టి సారించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం కడెం మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మాత్తుగా సందర్శించారు. తనిఖీల్లో ఎంపీడీవో అరుణ, అధికారులు పాల్గొన్నారు.



రేషన్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

కడెం : విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు అన్ని సమయాల్లో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం కడెం ప్రాజెక్టు వద్ద నిర్వహించిన మాక్‌డ్రిల్‌ను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ ప్రత్యేక అధికారి హరికిరణ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం చేపట్టిన రక్షణ విన్యాసాలను పరిశీలించిన అనంతరం వారు బోటులో ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భారీ వర్షాల వల్ల వరదలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో లోతట్టు గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భయపడాల్సిన అవసరం లేదని, విపత్కర పరిస్థితుల్లో స్పందించేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సిద్ధంగా ఉందని కలెక్టర్ వివరించారు. ప్రాజెక్టు గేట్లు, నీటి మట్టం, ఇన్‌ఫ్లో తదితర అంశాలపై అధికారులను అడిగి తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. నీటి పారుదల శాఖ అధికారులు అధిక వరద ప్రవాహానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండెంట్ అమర్ ప్రతాప్ సింగ్, ఎక్సైజ్ అధికారి ఎంఏ రజాక్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ, ప్రజలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పెంబి : నూతన రేషన్ కార్డుల పంపిణీతో ప్రభుత్వ పథకాలు అన్ని పేదలందరికీ మరింత మెరుగ్గా అందుతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం పెంబి మండలంలోని రైతు వేదికలో పలువురు అర్హులకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ప్రత్యేక అధికారి హరికిరణ్, ఖానాపూర్ సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నూతన రేషన్ కార్డులతో పేదలకు ఎంతగానో లాభం కలుగుతుందని తెలిపారు. నూతన రేషన్ కార్డుల జారీ, కార్డుల్లో మార్పులు, చేర్పులు నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ... పేదలందరికీ సన్న బియ్యం అందించాలన్న ఉద్దేశ్యంతో నూతన రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. పేదలందరికీ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

జిల్లా పరిషత్ పాఠశాలలో మాక్ పోలింగ్

ఉట్నూర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్‌ఎం జాదవ్ రమేష్ ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వాలు చేపడుతున్న పోలింగ్‌సరళిని చూయిస్తూ విద్యార్థులకు ఎన్నికల్లో పోటీ చేయించినట్లు ప్రజాప్రతినిధులను ఎన్నుకునే విధానాన్ని తెలియజేస్తూ పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు.

ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థికి అభినందన

పెంబి, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రాజస్థాన్ ఐఐటీలో సీటు సాధించిన మండలంలోని తాటిగూడ గ్రామానికి చెందిన గుగ్లావత్ వామన్ రావు అనే విద్యార్థిని శనివారం భూక్యా జాన్సన్ నాయక్ ఖానాపూర్ పట్టణంలోని తన నివాసంలో శాలువాతో అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నల్ల నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అశ్వక్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గోవింద్ ఉన్నారు.

'నిరాధార ఆరోపణలు సరికాదు'

దిలావర్‌పూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ నిధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్ రెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేయడం మానుకోవాలని స్త్రీ నిధి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇ. సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్త్రీనిధి సంస్థ, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌పై కొంత మంది వ్యక్తులు పనిగట్టుకుని నిరాధార ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు.

విద్యతో ఎదగాలి

నిర్మల్ రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ విద్యార్థులు ఇంటి వద్ద విద్యను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ విలీన విద్యా సమన్వయకర్త ఎస్. ప్రవీణ్ కుమార్ అన్నారు. పట్టణంలోని రాంనగర్‌లో గల మానసిక దివ్యాంగ విద్యార్థి మోక్షిత్ ఇంటిని శనివారం సందర్శించి, అక్కడ ఐఈఆర్‌పి రాకేష్ అందిస్తున్న ఇంటి వద్ద విద్యాకార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ రాకేష్, తల్లిదండ్రులు, విద్యార్థి మోక్షిత్ పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీలు

తానూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్ సమీపంలో గల ఆయా కిరాణా, పాన్‌షాపులను శనివారం తనిఖీ చేసినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. ఈయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

దొరికిన బాలుడి ఆచూకీ

ఖానాపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : చదువుకోమని హాస్టల్‌కి వెళ్లమంటే ఇంట్లోంచి పారిపోయిన ఓ బాలుడిని ఖానాపూర్ పోలీసులు పట్టుకొని అతని తల్లికి అప్పగించారు. ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన కథనం ప్రకారం.. లక్ష్మణచాంద మండలం నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామానికి చెందిన కస్తూరి స్రవంతి తన కుమారుడు రితేష్ నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదోతరగతి చదివేందుకు హాస్టల్లో చేర్పించింది. కాగా ఇటీవల హోమ్ సిక్ హాలిడేస్ ఇవ్వడంతో ఇంటికి వచ్చిన రితేష్‌ను హాలిడేస్ ముగియగానే తిరిగి హాస్టల్‌కి వెళ్లమని తల్లి స్రవంతి చెప్పింది. దీంతో రితేష్ హాస్టల్‌కి వెళ్లడం ఇష్టం లేక ఇంట్లో ఎవరికి చెప్పకుండా శనివారం ఉదయం ఇంటి నుండి పారిపోయాడు. ఇంటి నుండి పారిపోయిన రితేష్ ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్ గ్రామానికి చేరుకొని ఎటు వెళ్లాలో తెలియక అటు ఇటు తిరుగుతుండగా గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పెట్రోకార్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ రావు కానిస్టేబుల్ సుధీర్ కుమార్ తర్లపాడ్‌కు చేరుకొని ఆ బాలుడిని పట్టుకుని పోలీస్ స్టేషన్ తరలించారు. తల్లి స్రవంతికి బాలుడిని అప్పగించినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

దేశీదారు తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

భీంపూర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని కినికి నుంచి భీం పూర్ మండలం సరిహద్దు గ్రామాలకు అక్రమంగా నిషేధిత దేశీదారు సరఫరా చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు జైనథ్ సీఐ డి.సాయినాథ్, ఎస్‌ఐ పీర్‌సింగ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణలో నిషేధిత దేశీదారు అక్రమంగా తీసుకవచ్చి అమ్ముతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు తొడ్సం వెంకట్రావు, ఆత్రం మోతీరామ్‌లను శనివారం సాయంత్రం లింగూడ గ్రామ శివారులో అదుపులో తీసుకొన్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 50 దేశిదారు బాటిల్లను, బైకును సీజ్ చేశామన్నారు. వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. జైనథ్ సి.ఐ డి.సాయినాథ్, ఎస్ఐ పీర్ సింగ్, హెడ్ కానిస్టేబుల్ గంగా రెడ్డి, మధుకర్‌లను డీఎస్పీ జీవన్‌రెడ్డి అభినందించారు.

ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ

● రూ.14 లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు



ఏటీఎంను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

మావల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంనగర్ లో గల ఎస్.బీఐ ఏ.టీ.ఎంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. శనివారం తెల్లవారుజామున, ఎస్బీఐ బ్రాంచ్ ఏటీఎంలో దొంగలు పడి రూ.14 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎస్పీ జీవన్ రెడ్డి, మావల, ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐలు స్వామి, సునీల్‌కుమార్‌లు ఘటనాస్థలానికి చేరుకున్నారు. గుర్తులు తెలియకుండా కెమెరాపై బ్లాక్‌స్ప్రే చేసి దొంగలు నగదుతో ఉడాయించినట్లు గుర్తించారు. ఏటీఎం మిషన్‌ను గ్యాస్‌కట్టర్‌తో కట్ చేసినట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. సీసీ టీవీ ఫుటేజ్ లను బ్యాంక్ వారు పోలీసులకు అందించలేదని మావల సీఐ స్వామి తెలిపారు. ఘటన స్థలంలో వేలిముద్రల సేకరణ, దొంగతనం జరిగిన తీరును పరిశీలించి విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. సీసీ ఫుటేజీ పోలీసులకు ఇవ్వడంలో బ్యాంకు అధికారులు వెనకడుగు వేస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. చోరీ జరిగిన సమయం నుంచి తదనంతర పరిణామాలపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నామని, అన్నికోణాల్లో విచారణ పూర్తిచేస్తామని పోలీసులు చెబుతున్నారు. దుండగులను పట్టుకోవడానికి ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇందిరా క్రాంతి ఏపీఎం బదిలీ

బోథ్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల ఇందిరా క్రాంతి ఏపీఎంగా పని చేసిన మాధవ్‌ను ఉట్నూర్ బదిలీ చేయడంతో ఆయన స్థానంలో జయశంకర్ భూపాలపల్లి నుంచి రతన్ సింగ్ బదిలీపై వచ్చారు. అంతేగాక త్వరలోనే ఆయా మండలాల సీసీలు సైతం బదిలీ కానున్నట్లు సమాచారం.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

భైంసా,జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కేంద్రమైన భైంసా పట్టణంలోని అల్ఫోర్స్ హైస్కూల్‌లో శుక్రవారం కార్గిల్ దివస్ విజయోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాలలో కార్గిల్‌లో అమరులైన వీర జవాన్‌ల త్యాగాలను స్మరిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కుంటాల : మండలంలోని కల్లూరు వాసవి విద్యానంన్దల ఆధ్వర్యంలో శనివారం కార్గిల్ యుద్ధ విజయ దినోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు సాయిలు, శ్రీనివాస్, సంతోష్, హైస్కూల్ కరస్పాండెంట్ జానకి రామ్ ఉన్నారు.



భైంసాలో సైనికుల వేషధారణలో చిన్నారులు

బోథ్ : మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాలలో శనివారం కార్గిల్ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలను చేతబట్టి విజయోత్సవ వేడుకలను జరుపుకున్నారు.

దిలావర్‌పూర్ : మండలంలోని సిర్గాపూర్ ప్లేయర్ హైస్కూల్‌లో శనివారం కార్గిల్ విజయ్ దివస్‌ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంపై క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

ఉట్నూర్ : మండలంలోని బీరుసాయిపేట జీయర్ గురుకులం పాఠశాలలో మేరా యువ భారత్ సిబ్బంది ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మేరా యువ భారత్ సిబ్బంది శేఖర్ మాజిద్, ఆదర్శ యువజన సంఘం వ్యవస్థాపకులు గన్నేరువరం రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండండి : ఎస్సై శ్రీనివాస్

లక్ష్మణచాంద, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు కురుస్తున్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీనివాస్ శనివారం కోరారు. మండలంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయం సమీపంలో భారీ వర్షాలకు విరిగి రోడ్డుపై పడిపోయిన చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన పై సందేశాన్నిచ్చారు. వాగులు, లోయలు, నదుల సమీపంలోని లోతట్టు ప్రాంతాలకు ప్రజలు వెళ్లకూడదన్నారు. మత్స్యకారులు చేపల సేకరణకు వెళ్లకూడదన్నారు. రైతులు, ప్రయాణికులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన శిక్షణ తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మంచిర్యాల, కొమురం భీమ్, ఆదిలాబాద్ జిల్లాల డివిజన్ మండల అధ్యక్షులు ప్రశిక్షణ శిబిరం శనివారం నిర్మల్‌లోని దివ్య గార్డెన్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రశిక్షణ తరగతులను ప్రారంభించారు. నేతలు ప్రతినిధులకు, మండల అధ్యక్షులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు.

'వర్షాకాలం ముందస్తు చర్యలు తీసుకోవాలి'

నిర్మల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్ ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఆయన రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, ఆరోగ్య, అగ్నిమాపక, విద్యుత్, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిద్దిపేటకు తరలిన ఖానాపూర్ మారథాన్ బృందం

ఖానాపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఆదివారం నిర్వహించనున్న మారథాన్ రన్‌లో పాల్గొనేందుకు ఖానాపూర్ మారథాన్ బృందం సిద్దిపేటకు తరలి వెళ్లింది. తన ఆధ్వర్యంలోని 15 మంది మారథాన్ బృందం సభ్యులు సిద్దిపేటకు తరలి వెళ్తున్నట్లు స్థానిక వైద్యులు కిరణ్ కుమార్ తెలిపారు. సిద్దిపేటకు తరలి వెళ్లిన వారిలో ఖానాపూర్ మారథాన్ బృందం సభ్యులు నువ్వుల రాజేందర్, రాపెల్లి రాజు యాదవ్, చిలుకూరి వెంకట రాములు, న్యాయవాది బాశెట్టి శివ, శశిధర్, సాజిత్ ఉన్నారు.

వరద నీటికి అడ్డంకిగా మారిన పూడిక

ఉట్నూర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగన్నపేట చెరువులోకి వరద నీరు వచ్చే కాలువలో పూడికపేరుక పోవడంతో చెరువు నిండడం లేదు. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్న చెరువులోకి నీరు రాక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్కారం, సుద్దగూడ గ్రామాల మధ్య ఉన్న నేరేడు చెరువులోని మత్తడి నీటికాలువ పై నిర్మించిన వంతెన వద్ద మట్టి కాలువలో పడి పూడిక నిండిపోవడంతో రోడ్డు నిర్మాణం కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో కాలువలోని పూడికను తొలగించడంతో గంగన్నపేట చెరువులోకి వరద నీరుచేరుకుంటుంది.

ప్రభుత్వ కళాశాల తనిఖీ

ఉట్నూర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కొట్నూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి జాదవ్ గణేష్ కుమార్ శనివారం తనిఖీ చేశారు. కళాశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసిన తరగతి బోధన ఇతర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ధనరాజ్, జిల్లా ఇంటర్మీడియట్ సూపరింటెండెంట్ మోసిన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి'

ఉట్నూర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలో పర్యటించి రైతులు వినియోగదారులతో వర్షాలు పడుతున్నందున ఎక్కడ ఎలాంటి విద్యుత్ అంతరాయాలున్నా 1912కి సిబ్బందికి తెలియజేయాలని ఎన్‌పీడీఎస్‌ఎల్ సీఈ చౌహాన్ జయవంత్‌రావు అన్నారు. శనివారం ఉట్నూర్ డివిజన్ విద్యుత్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమన్వయ సమావేశంలో మాట్లాడారు. అన్ని సర్వీసులు ట్రాన్స్‌ఫార్మర్‌లు సరియిన ఫీడర్స్ మీద మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డివిజనల్ ఇంజనీర్, మండల ఇంజనీర్లు, సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

'విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలి'

ఆదిలాబాద్ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌తో విద్యార్థుల్లో తీవ్ర ప్రభావం పడుతుందని డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ర్యాగింగ్ యాక్ట్‌పై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ర్యాగింగ్ వల్ల జరిగే పరిణాలుజజణామాలు, చట్టంలోని కేసులు తదితర అంశాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ... ర్యాగింగ్‌కు గురైన వారు బయట చెప్పకపోవడం వారిలో తీవ్ర ఒత్తిడిని తీసుకువస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్నాల నగేష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ గంగారాం, అశోక్, ఉమేష్ డోలే, ప్రిన్సిపల్ ప్రమోద్ పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు

● హెచ్ఏసీఏ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు

నేరడిగొండ, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు హెచ్ఏసీఏ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం కార్యాలయాన్ని ఆకస్మికంగా హాక జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామిలు తనిఖీ చేశారు. ఎరువుల సరఫరాలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సంఘం ఇంచార్జి అసిస్టెంట్ రిజిష్టర్ అరుణ. సీనియర్ అసిస్టెంట్ జలాల్, వ్యవసాయ విస్తరణ అధికారులు కె.శ్యామ్. ఇసౌజన్య. సీఈవో నాగభూషణం. కార్యదర్శి కే గంగన్న. సంతోష్, రాజేందర్, గఫర్‌లు ఉన్నారు.

చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నిర్మల్ రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం నియోజకవర్గంలోని నిర్మల్ పట్టణం, రూరల్, సోన్, మామడ, లక్ష్మణచాంద, సారంగాపూర్, దిలావర్‌పూర్, నర్సాపూర్ మండలాలకు చెందిన 52 మంది లబ్ధిదారులకు రూ. 12,50,000ల చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నిర్మల్ మండల పరిషత్ మాజీ అధ్యక్షులు వి. సత్యనారాయణ గౌడ్, మండల అధ్యక్షులు, మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

ఖానాపూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో మధ్యాహ్న భోజన కార్మికులు తలపెట్టిన నిరసన కార్యక్రమం ఖానాపూర్‌లో రెండోరోజు కొనసాగింది. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బైఠాయించి మధ్యాహ్నభోజన కార్మికులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజన యూనియన్ మండల అధ్యక్షులు లక్ష్మీ మాట్లాడుతూ... మధ్యాహ్న భోజనకార్మికుల పెండింగ్ బిల్లులను, జీతాలను వెంటనే విడుదల చేయాలన్నారు.కార్యక్రమంలో మండల కార్యదర్శి విజయ, ఉపాధ్యక్షురాలు పద్మ, మంజుల, మంగ, రాజేశ్వర్, సత్యమ్మ, లింగవ్వ, తదితరులున్నారు.

పెంబి : మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షులు గోదూరి మల్లేష్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంఈవో ఆఫీస్ ముందు మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు లక్ష్మీ, మండల కార్యదర్శి చీకటి లక్ష్మీ, మండల ఉపాధ్యక్షులు వందన, తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌లైన్ రోడ్డును విస్తరించాలని వినతి



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

లక్ష్మణచాంద, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే డబుల్‌లైన్ రోడ్డును విస్తరించాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం మంత్రి కోమట్ రెడ్డి వెంకట్ రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ రోడ్డు విస్తరణ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ కొందరు నాయకుల స్వార్థం వలన ఈ పనులు ఆగిపోయాయని ఆ వినతి పత్రంలో ఆరోపించారు. ఈ రోడ్డు ఇరుకుగా ఉండటం కారణంగా ట్రాఫిక్ నిలిచిపోయి మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాబట్టి త్వరితగతిన రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, నారాయణ, కోంద్ర నరేష్ రెడ్డి, అబ్బడి ప్రతాప్ రెడ్డి, తదితరులున్నారు.

అర్హులందరికీ 'ఇందిరమ్మ'

● ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

భైంసా రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే కోటాలో ఇళ్లు మంజూరు కాగా అడ్డంకులు సృష్టించడంతో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ స్వయానవెళ్లి పనులు ప్రారంభించారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని, రాని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సిరాల గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కామోల్ గ్రామంలో 30 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూ రు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రజాక్, వైస్ ఎంపీపీ నర్సారెడ్డి, సీనియర్ నాయకులు సొలంకి భీమ్ రావు, మండల బీజేపీ అధ్యక్షురాలు సిరం సుష్మారెడ్డి, నాయకులున్నారు.

కోర్ట్ సిబ్బందికి శిక్షణ

ఆదిలాబాద్ టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కోర్టు సిబ్బంది పనితీరును మరింతగా మెరుగుపరుచుకోవాలని జిల్లా న్యాయాధికారి ప్రభాకర్ రావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో హైకోర్టు నుంచి శిక్షణ పొంది వచ్చిన టి.అశోక్.. కోర్ట్ సూపరింటెండెంట్లతో పాటు సిబ్బందికి పని విధానాల గురించి శిక్షణ అందించారు. జిల్లా ప్రధాన న్యాయాధి కారి ప్రభాకర్ రావు మాట్లాడుతూ... ఉద్యోగులు పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు రాజ్యలక్ష్మి, హుస్సేన్, కుమార్ వివేక్, ఏటసూర్యకాంత్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ఆదిలాబాద్ టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో జరిగిన 51వ జూనియర్ నేషనల్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పట్టణానికి చెందిన కొమ్ము చరణ్ తేజ్ ప్రతిభ కనబరిచాడు. వాటర్ పోలో విభాగంలో నేషనల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. సదరు విద్యార్థిని స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేందర్ జిత్ కుమార్, డీవైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అభినందనలు తెలిపారు.



నారు బుట్టలలో మొలకలు వచ్చిన నవధాన్యాలు

ప్రారంభమైన తీజోత్సవం..

(5వ పేజీ తరువాయి...)

పండుగను జరుపుకొంటారు.

అంకురార్పణే ప్రధానం..

తొమ్మిది రోజుల పాటు నిర్వహించే తీజ్ పండుగను దాటుడు పండగా (సీత్లా భవాని పండుగా)తో గిరిజనులు అంకురార్పణ చేస్తారు. తండాల్లోని పెళ్లి కాని యువతులు వారి సోదరుల సహకారంతో అడవికి వెళ్లి పుట్ట మన్నును సేకరిస్తారు. వెదురు, దుసేరు తీగలతో అల్లిన బుట్టల్లో సేకరించిన పుట్టమట్టిని పోసి గోధుమ గింజలను వేస్తారు. ఈ విధంగా తండాల్లోని ప్రతీ యువతి తయారు చేసిన బుట్టలు తండా పెద్ద ఇంటి వద్ద ఏర్పాటు చేసిన మంచెపై పెడుతారు. గోధుమ గింజలతో పాటు నవధాన్యాలు ఉన్న వెదురు బుట్టలకు తొమ్మిది రోజల పాటు యువతులు నీళ్ల పోసి పెంచి పోషిస్తారు. ఈ బుట్టల్లో పెరిగిన నవధాన్యాలలో ఏ విత్తనం బలంగా పెరిగిందో పరీక్షించి అదేపంటను సాగు చేయాలని పూర్వం తండా పెద్దలు నిర్ణయించేవారు. అవగాహన లేకుండా పంటను వేసి నష్టపోకుండా ఉండేందుకు ఈ పండగా రూపంలో గోధుమ మొలకలను పెంచుతారు.

కోలహలంగా నిమజ్జనం

ఎప్పుడైన బుధవారం రోజున తీజ్ పండగ ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న పచ్చటి గోధుమ నారు బుట్టలను చివరి రోజు పందిరిపై నుంచి కిందకు దించుతారు. తండా కూడలిలో బతుకమ్మ మాదిరిగా పెట్టి డప్పుల చప్పుళ్లతో గిరిజన సంప్రదాయ నృత్యాలు చేస్తారు. తీజ్ పండగలో చివరి వేడుకను ప్రధాన ఘట్టంగా భావిస్తారు. నారు బుట్టలను సమీప వాగుల్లో, చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. సోదరులు పెళ్లి కాని యువతుల కాళ్ల కడిగి వెంట తెచ్చుకున్న ఆకు కూరలు, రొట్టెలు ఆహారంగా తీసుకుని ఇళ్లల్లోకి చేరుకుంటారు.

తీజ్ ఎలా పుట్టింది?!

నేపాల్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో మహిళలు ప్రధానంగా తీజ్‌ను జరుపుకొంటారు. వర్షాకాలం రాకను గుర్తు చేసుకుంటూ పార్వతిదేవి, శివుడి ఐఖ్యతను గౌరవించే ఆనందకర సందర్భంలో జరుపుకునే అతిపెద్ద పండుగ తీజ్ అని పూర్వీకులు చెబుతారు.

తీజ్ పండుగ ఉద్దేశం...

మహిళలు ఉపవాస దీక్షలు ఆటపాటలతో ప్రత్యేకంగా జరుపుకొనే పండుగ తీజ్. వివాహిత మహిళలు తన భర్త క్షేమంగా ఉండి నిండు నూరేళ్ల జీవించాలని ప్రార్థించగా, పెళ్లికాని యువతులు మంచి భర్త దొరకాలని ప్రార్థిస్తారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో జీవించాలనే ఉద్దేశంతో తీజ్ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

● బంజారుల పెద్ద పండుగ తీజ్ : ఉదయ్

లంబాడి జాతులకు అతిపెద్ద పండుగ తీజ్. గ్రామ ప్రజ లంతా క్షేమంగా ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురిసి పా డిపంటలతో పచ్చగా ఉండాలని వర్షాకాలంలో తీజ్ పండుగ జరుపుకుంటాం. తెలంగాణ వ్యాప్తంగా ఒకేరోజున తీజ్ పండుగ జరుపుకోవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలి.

● ఏళ్ల నుంచి జరుపుకుంటున్నాం : గోపాల్

తీజ్ పండుగ ఎన్నో ఏళ్ల నుంచి జరుపుకుంటున్నాం. పెళ్లి కాని యువతకులకు ప్రత్యేక పండుగ. 9 రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టి మొలకెత్తిన పచ్చటి నారుకు పూజలు చేస్తూ జరుపుకునే ఏకైక పండుగ తీజ్. బతుకమ్మ పండుగ మాదిరిగానే వేడుకలు ఉంటాయి. ఈ పండుగతో తండాలో ఐక్యత పెరుగుతుంది.

పల్లె పోరుపై.. గురి!

(5వ పేజీ తరువాయి...)

ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి పెద్ద సవాలుగా మారగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ముమ్మర ప్రయత్నాలు మొదలు పెట్టాయి. అదేవిధంగా జిల్లాలో మూడు ప్రధాన పార్టీలు పోటాపోటీలుగానే కనిపిస్తున్నాయి. అయితే, ఈసారి ఏ పార్టీకి వన్‌సైడ్ ఫలితాలు వచ్చే అవకాశం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

కుంటాల, జూలై, 26 (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని దౌనెల్లి పంచాయతీ పరిధిలో గల రాయపాడ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం స్కూల్ బ్యాగులు, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. ఇటీవల కుంటాల మండలంలో ఎంపీవోగా విధులు నిర్వహించి పదోన్నతిపై ఇతర శాఖలో ఉద్యోగం పొందిన (ఎక్సైజ్ ఎస్సై) గంగాధర్ ఆయన తండ్రి కీర్తిశేషులు ఊర్ల (అంజమాన్) గంగారాం స్మారకార్థం ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు.

ఎరువుల గోదాంను తనిఖీ చేస్తున్న అధికారులు

తలమడుగు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని గోదామును శనివారం మండల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల అధికారి ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. ఎరువులు తీసుకున్న రైతులు ఆధార్ కార్డు పట్టా పాస్ బుక్ తీసుకొచ్చి ఎరువులు తీసుకెళ్లాలని సూచించారు. ఎవరైనా అక్రమంగా ఎరువులు విక్రయిస్తే కఠిన చర్య తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎరువులకు సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో సీఈవో మోతే శ్రీనివాస్, ఎస్సై రమేష్, రెవెన్యూ అధికారులు లింగన్న, సురేష్, సహకార సంఘం సిబ్బంది సాగర్, బబ్లూ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా అధికారి

బోథ్, జూలై 26(ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని మహదుగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వర్షాకాలం విద్యార్థులు కూర్చునేందుకు తీవ్ర ఇబ్బందులు, అంగన్‌వాడీ సమస్యల ఐడి అన్న వార్తకు జిల్లా అధికారులు స్పందించారు. దీంతో శనివారం జిల్లా అధికారి పిడి మిల్కాతో పాటు సూపర్‌వైజర్‌లు గ్రామస్తులతో సమావేశమై చర్చించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చి అద్దె భవనంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ విషయమై గ్రామస్తులు పీడి గ్రామస్తులతో మాట్లాడారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంతో పనిచేయాలి'

ఇంద్రవెల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రితేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు కేంద్రే బాలాజీ ఆధ్వర్యంలో స్థానిక సంస్థ ఎన్నికలపై ఏర్పాటు చేసిన వర్క్ షాప్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థ ఎన్నికలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఖానాపూర్ అసెంబ్లీ కో కన్వీనర్ అరెల్లి రాజలింగు, మండల ప్రధాన కార్యదర్శి రాథోడ్ భీంరావు, నాయకులు కనక హనుమంత్‌రావు, కోవ రాజేశ్వర్, దీపక్‌సింగ్ ఉన్నారు.

గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానించిన కంది శ్రీనివాస్ రెడ్డి

ఆదిలాబాద్ టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన మల్లెపూల నర్సయ్యను ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, గిమ్మ సంతోష్, సెడ్మకే ఆనంద్ రావు, భూపెల్లి శ్రీధర్,లోక ప్రవీణ్ రెడ్డి, అల్చెట్టి నాగన్న పాల్గొన్నారు.

గంజా గస్తీ కార్యక్రమంలో భాగంగా

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు

» ఎస్పీ జానకీ షర్మిల



కిరాణా షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న రూరల్ ఎస్సై లింబాద్రి

నిర్మల్ రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజా గస్తీ కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు. మండలంలోని మంజులాపూర్ పాఠశాల సమీపంలోని కిరాణా, పాన్ దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని పోలీస్ స్టేషన్ల ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌హెచ్‌వోలు తమ పరిధిలోని పాఠశాలలు, ఇంకా ఇతర నివాస స్థలాలకు దగ్గరగా ఉన్న పాన్ షాపులు, కిరాణా దుకాణాలు ఇతర వ్యాపార కేంద్రాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ముఖ్యంగా మత్తు పదార్థాల విక్రయంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌హెచ్‌వోలు సంబంధిత దుకాణదారులకు గంజా వంటి మత్తు పదార్థాలు విక్రయించడం అనేది చట్టపరంగా నేరమని హెచ్చరించారు. ఒకవేళ ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలు గుర్తించినతో తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒకవేళ మీ పరిసర ప్రాంతాల్లో గంజా లేదా ఇతర నిషేధిత మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయం జరుగుతున్న సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 100 లేదా 87126 59599 నెంబర్‌కు కాల్ చేయండి. మీ వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌హెచ్‌వోలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

ముథోల్‌లో..



ముథోల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ముథోల్: జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ ఆదేశాల మేరకు గంజా గస్తీ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన ముథోల్‌లో పోలీసులు కిరాణా షాప్‌లను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌వోలు తమ పరిధిలోని పాఠశాలలు ఇంకా ఇతర నివాస స్థలాలకు దగ్గరగా ఉన్న పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, ఇతర వ్యాపార కేంద్రాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ముఖ్యంగా మత్తు పదార్థాల విక్రయంపై ప్రత్యేక దృష్టి సారించారు. సంబంధిత దుకాణదారులకు గంజా వంటి మత్తు పదార్థాలు విక్రయించడం అనేది చట్టపరంగా నేరమని హెచ్చరించారు. ఒకవేళ ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలు గుర్తించినతో తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌హెచ్‌వోలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాకాలంలో చంటోళ్లు జర జాగ్రత్త!

● పొంచి ఉన్న వ్యాధుల బెడద

● ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచిస్తున్న వైద్యులు



శిశువుకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు డా. దయానంద్ రెడ్డి

భైంసా, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎడతెరపిలేని వర్షాలతో వాతావరణంలో తేమశాతం పెరిగింది. అంటూ రోగాల ప్రమాదం పొంచి ఉంది. చల్లదనం కారణంగా వ్యాధులు వేగంగా వ్యాపిస్తాయి. చంటి పిల్లల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దోమలు, బ్యాక్టీరియా, వైరస్‌ల ప్రభావంతో వ్యాధులు సోకుతాయి. ఇటీవల వివిధ సమస్యలతో చికిత్స కోసం ఆసుపత్రులకు వస్తున్న చంటి పిల్లల సంఖ్య పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో శిశువుల ఆరోగ్య సంరక్షణకు తల్లిదండ్రులు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

● **సమస్యలు ఇవీ..**

వాతావరణంలో మార్పులు పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ఈ కాలంలో ఉష్ణోగ్రతలు ఒక్కో రోజు ఒక్కో రకంగా నమోదువతాయి. వర్షం పడినప్పుడు గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది. లేని రోజు పొడిగా, వెచ్చగా ఉంటుంది. ఈ అస్థిర వాతావరణం పసిపిల్లలకు ఇబ్బంది కలిగిస్తుంది. ఇలాంటి తరుణంలో తేలికగా వ్యాధుల బారినపడతారు. చంటి పిల్లల్లో ప్రసరణ వ్యవస్థ శరీర ఉష్ణోగ్రతను నిర్వహించటానికి పూర్తి అనుకూలంగా ఉండదు. ప్రస్తుత కాలంలో డయేరియా, జలుబు, శ్వాసకోశ సమస్యలు, వైరల్, ఫంగల్, ఇన్‌ఫెక్షన్లు, అలర్జీలు, దోమకాటు వ్యాధులు ఎక్కువగా కనిపిస్తాయి. రోగ నిరోధక శక్తి అభివృద్ధి చెందుతున్న తరుణంలో పిల్లలు అనారోగ్యాల బారిన పడితే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది.

● **తల్లులు పాటించాల్సినవి...**

ప్రసవ సమయంలో చంటి బిడ్డతో తల్లులు (బాలింతలు) కొద్ది రోజుల పాటు ఆసుపత్రుల్లో గడపాల్సి వస్తుంది. ఈ సమయంలో చేతులు శుభ్రం చేసుకుని పిల్లలను పట్టుకోవాలి. బిడ్డ పుట్టిన వెంటనే రోడ్డుపైన లభించే దుస్తులు తీసుకొచ్చి ధరింపజేయటం శ్రేయస్కరం కాదు. దుమ్ము, ధూళితో రోగాలకు కారణమవుతాయి. ఉతికిన దుస్తులు మాత్రమే శిశువుకు తొడగాలి. దోమలు, సూక్ష్మక్రిములు, వైరస్‌ల బారిన పడకుండా సురక్షితంగా ఉంచుకోవాలి. ఇంటికెళ్లిన తర్వాత కూడా ఈ జాగ్రత్తలు తప్పనిసరి అని గుర్తించాలి. స్నానాల గదులు, గార్డెన్, బాల్కనీలు, ఇంటి ఫ్లోర్ మొదలైన వాటిని క్రిమి సంహారక మందులతో శుభ్రం చేయాలి. పిల్లలు దోమకాటుకు గురవకుండా, దోమ తెర కింద పడుకునేలా ఏర్పాట్లు చేయాలి. లేతంటే కాటన్ దుస్తులను ధరింపజేయాలి.

బాసర ఆర్జీయూకేటీలో చేరేందుకు మరో అవకాశం

» మిగిలిపోయిన గ్లోబల్ కోట సీట్లు

» టెన్త్‌లో కనీసం 70శాతం మార్కులున్నవారు అర్హులు



బాసర ఆర్జీయూకేటీ ప్రధాన ద్వారం

బాసర, జూలై 26 (ఆంధ్రజ్యోతి):బాసర ఆర్జీయూకేటీలో చేరే వారికి ఇది మరో అవకాశం.మిగిలిపోయి గ్లోబల్ కోట సీట్లను ఆసక్తి గల విద్యార్థులతో భర్తీ చేసేందుకు ప్రకటన విడుదల చేశారు. పదవ తరగతిలో కనీసం 70శాతం మార్కులు సాధించిన విద్యార్థులను అడ్మిషన్ తీసుకోవచ్చని చెప్పారు. గ్లోబల్ కోట కింద ప్రవేశం పొందిన విద్యార్థులు ఏడాది రూ ఒక లక్ష నాలబై వేల ఫీజు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 30వ తేదీన బాసర క్యాంపస్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. పదవ తరగతి హాల్‌టికెట్, మార్కుల జాబితా,రిజల్ట్ సర్టిఫికెట్ ఇతర ధృవీకరణ పత్రాలు తీసుకొనిరావాలని చెప్పారు. మరిన్ని వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్జీయూకేటీ.ఏసీ.ఇన్ చూడవచ్చని చెప్పారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి 6200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

● 355.9 మీటర్ల నుంచి 356.3 మీటర్లకు పెరిగిన నీటి మట్టం



గడ్డెన్న వాగు ప్రాజెక్టు

భైంసా, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో శనివారం గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి 6200 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ఈ క్రమంలో ఉదయం వేళలో 355.9 మీటర్లుగానున్న ప్రాజెక్టు నీటి మట్టం రాత్రి వేళ వరకు 0.4 మీటర్ల మేర పెరిగి 356.3 మీటర్లకు ఎగబాకింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు, 1.83 టీఎంసీలుగా ఉండగా శనివారం రాత్రి 9 గంటలకు ప్రాజెక్టు నీటి మట్టం 356.3 మీటర్లకు చేరుకోగా 0.696 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. ఎగువ ప్రాంతంలో వరుణుడి జోరు కొనసాగుతున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం వేళ వరకు ప్రాజెక్టు నీటి మట్టం మరింతగా పెరిగే అవకాశాలున్నాయి.

ఎడతెరిపి లేని వర్షం



పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షం నీరు

ముథోల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరుకుంది. అలాగే పలు వ్యవసాయ చేనుల్లో వర్షం నీరుతో కొన్ని చోట్ల పంటలు మునిగాయి. మొన్నటి వరకు వర్షం కోసం ఎదురుచూసిన అన్నదాతలకు మూడు రోజుల నుంచి భారీ వర్షం కురియడంతో ఒక పక్క వరి నాట్లు వేయడంతో బిజీ కాగా మరో పక్క లోతట్టు ప్రాంతంలోని చేనుల లో వర్షం నీరు చేరింది. అలాగే ముద్గల్ గ్రామంలోని వ్యవసాయ చేనుల నుంచి గ్రామంలోని వర్షం నీరు ప్రభుత్వ పాఠశాల ఆవరణలోకి చేరుకున్నాయి.

చింతగూడ చెరువుపై నిర్మిస్తున్న రోడ్డుకు గండి



ప్రమాదాలు జరుగకుండా గండికి అడ్డంగా బండలు పేరుస్తున్న దృశ్యం

ఉట్నూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.8 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు నాణ్యతా లోపం కారణంగానే గండిపడిందని గిరిజనులు ఆరోపిస్తున్నారు. మండలంలోని కల్లూరుగూడ నుంచి చింతగూడ గ్రామానికి నిర్మిస్తు న్న రోడ్డుకు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ఆధ్వర్యంలో రూ.8కోట్లు మంజూరు చేయించారు. చింతగూడ చెరువు మత్తడిపై భారీ వంతెన నిర్మించడంతో పాటు బీటీ రోడ్డు నిర్మాణం నాలుగు నెలలుగా చేపడుతున్నారు. చెరువు కట్టపై మనం పోసి రోడ్డును వెడల్పు చేసి నప్పటికీ సరైన విధంగా మొరం పోసి గట్టితనం కోసం రోలర్ నడిపించక పోవడం వల్ల రోడ్డుకు గట్టితనం లేక గండి ఏర్పడిందని, పనుల్లో నాణ్యత లేక పోవడం వల్లనే రోడ్డుపై గండ్లు ఏర్పడుతున్నాయని గిరిజనులు పేర్కొంటున్నారు. మండలంలోని ఘన్పూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పంద్ర జయవంత రావుకు శుక్రవారం ఉదయం చెరువు కట్టపై నిర్మిస్తున్న రోడ్డుకు గండ్లు పడ్డాయని సమాచారం రావడంతో ఆయన అక్కడికి చేరుకుని ప్రమాదం జరుగకుండా ఉండడానికి గండి వద్ద స్వయంగా రాళ్ల పేర్చారు.

ఝరి(బి) గ్రామానికి వంతెన నిర్మించండి



స్థానికుల సహాయంతో వంతెన దాటుతున్న ప్రజలు



వరద ఉధృతికి ఆగిపోయిన ప్రజలు, వాహనాలు

● వర్షాకాలం వచ్చిందంటే రాకపోకలకు ఇబ్బందులు

● వరద ఉధృతితో ప్రాణాలు పోయినా పట్టించుకోరా..?

● వంతెనను నిర్మించాలని గ్రామస్థుల వేడుకోలు..

తానూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఝరి(బి) గ్రామానికి వంతెనను నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే వర్షప్రభావంతో లోలెవెల్ వంతెన ఉండడం వలన గ్రామానికి రాకపోకలు నిలిచి పోతున్నాయని ఝరి(బి) గ్రామస్థులు, ఝరి (బి) తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వర్షాకాలంలో తీవ్రమైన వర్షాలు పడే నేపథ్యంలో లోలెవెల్ వంతెన ఉండడం వలన వరద ఉధృతికి లోలెవెల్ వంతెనపై మనుషులు, పశువులు, వాహనాలు, కొట్టుకుపోయేంత ప్రమాదకరంగా నీటి ఉధృతం ప్రవహిస్తుందంటున్నారు. వర్షాకాలం వచ్చిందంటే సరే వాహనాలు రాత్రి వేళలో ప్రయాణించాలంటే సాహసమే చేయాలని, ప్రాణాలు అరిచేతలో పెట్టుకొని వెళ్లడమే అంటున్నారు. అంతేకాకుండా సాయంత్రం వేళలో పాఠశాల, కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు చదువుల కొరకు తానూర్, భైంసా పట్టణాలకు వెళ్లి వచ్చే క్రమంలో ఇలా వర్షాలు పడడంతో వరద ఉధృతి తగ్గే వరకు ఆగాల్సిందే, ప్రత్యామ్నాయం ఏమి లేదు. అంతేకాకుండా అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లే క్రమంలో గాని నిండు గర్భిణులు ఉన్నప్పటికయిన వరద ఉధృతికి ప్రత్యామ్నాయం లేక ప్రభావం తగ్గేంత వరకు ఆగాల్సిందేనని గ్రామ ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలు గడుస్తున్న, ఎన్ని ప్రభుత్వాలు వచ్చిపోయిన చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. సంవత్సరం క్రితం నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత సంబంధిత శాఖ అధికారులు బ్రిడ్జి కొలతలు తీసుకెళ్లిన ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణం చేపట్టక పోవడం దురదృష్టకరమని గ్రామవాసులన్నారు. ఇకనైనా స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామంయందు దయతలిచి త్వరలోనే వంతెనను నిర్మించగలరని వేడుకుంటున్నామన్నారు.

సౌభాగ్యాలకు
అన్నపూర్ణేశ్వరి దేవి ని'దర్శనం'



దక్షిణాభిముఖంగా భక్తులకు దర్శనమిస్తున్న కదిలి మాతాన్నపూర్ణేశ్వరి దేవి

దిలావర్‌పూర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం మొదలైంది. వెయ్యి ఏళ్ల చరిత్ర ఉన్న కదిలి మాతాన్న పూర్ణేశ్వరి దేవి దక్షిణాభిముఖంగా భక్తులకు దర్శనమిస్తారు. భక్తుల మొర ఆలకించి అభయం ఇచ్చేందుకు అమ్మవారు సిద్ధమయ్యారా.. అన్నట్లుగా ఆలయ అర్చకులు శ్రావణ మాసం మొదటి శనివారం అమ్మవారిని అలంకరించారు. కదిలిలో కొలువైన అమ్మవారిని నియమ నిష్ఠలతో కొలుస్తే అష్టైశ్వరాలు సిద్ధిస్తాయని, శని బాధల నుంచి విముక్తులవుతారని ఎన్నో ఉదంతాలను భక్తులు పేర్కొంటారు. అమ్మవారు గుండెల్లో పెట్టుకుని భక్తులను కాపాడుకుంటుందని చెబుతారు. అమ్మవారిని నమ్మి కొలుస్తే ఇంట్లో లేమి అనే దానికి తావుండదని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీవాణి, ఎస్పీ జానకి షర్మిల

కేసుల విచారణలను
వేగవంతం చేయాలి

» నిర్మల్ జిల్లా న్యాయాధికారి శ్రీవాణి

నిర్మల్ రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : కేసుల విచారణలను వేగవంతం చేయాలని న్యాయాధికారి శ్రీవాణి అన్నారు. శనివారం జిల్లా న్యాయ మండలిలో, జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి శ్రీవాణి అధ్యక్షతన జిల్లా పోలీసు అధికారి డా.జి. జానకి షర్మిల ఐపీఎస్ సమక్షంలో కేసుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయాధికారి పోలీసు అధికారులకు, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేస్తూ పెండింగ్‌లో ఉన్న కేసులు, వారెంట్ల అమలు, చార్జ్‌షీట్లు దాఖలు వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కేసుల విచారణలను వేగవంతం చేయాలని, సకాలంలో చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని, న్యాయ ప్రక్రియలు ఆలస్యం కాకుండా చూడాలని, సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమీక్షలో జిల్లా సబ్ జడ్జి శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాధిక, ఆర్డీవో రత్న కళ్యాణి, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఐపీఎస్, నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్, ఇన్‌స్పెక్టర్లు, ఏఎస్సైలు, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లు, ఇతర కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన

ఐయినాలంగా తెలియజేయునది ఏమనగా Chikram Laxman S/o. Jangu, age : 56yrs, Occ : Govt Employee, R/o. H.No. 2-19, Subash Nagar, Utnoor, Adilabad.

RCC House bearing H.No. 2-19, total extend 386.6 Sq.yards or 323.29 Sq.mtrs in Sy.No. 20 situated at village G.P of Mandal Utnoor, District Adilabad Sub District & Registration District Adilabad లో ఉం ఈ హద్దులు తూర్పు: Plot No. 9, పడమర: Open Place of Sy.No. 20, ఉత్తరం: Road, దక్షిణం: Open Place of Sy.no. 20

[illegible] (05) రోజుల లోపల ఈ క్రింది చిరునామాకు తెలియ జేయగలరు.

ఇట్లు సం/- [illegible] అడ్వకేట్ [illegible] సెల్ : 9440070078

NOTICE OF THE DAY FIXED FOR SETTLING A SALE PROCLAMATION
(Order XXI, Rule 66 of C.P.C.)
IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT NIRMAL
E.P.NO.27 OF 2019 IN O.S.NO.40 OF 2014

Between:
Brahmarouthu Narsaiah ...Petitioner/D.Hr.Plaintiff
AND
Keerthi Narsaiah (Died) per his L.Rs ...Repondents/J.Dr.Defendants
To
J.Dr. No.3: Keerthi Vijender S/o. Narsaiah, Aged about 36 Years, Occ: Private Employee, R/o.H.No. 20-137, 20-138, 20-139, 20-140, Shanthinagar, Khanapur, Village and Mandal, Dist. Nirmal.
J.Dr. No.4: Keerthi Pavani D/o. Keerthi Narsaiah, Aged about 32 Years, Occ: Student, R/o.H.No.20-137, 20-138, 20-139, 20-140, Shanthinagar, Khanapur, Village and Mandal, Dist. Nirmal.

WHEREAS in the above named suit Brahmarouthu Narsaiah S/o. Limbaiah alias Limbagiri, aged about 72 years, Occ: Retired Employee, R/o. 19-63, Vidyanagar, Khanapur, Dist. Nirmal, the Decree Holder, has applied for the sale of the properties mentioned in the schedule. You are hereby informed that the **11th day of August 2025** has been fixed for stting the terms of the proclamation of sale.

SHEDULE OF IMMOVABLE PROPERTIES OF J.Dr
Sy.No.63, extent Ac. 2-25 gts. Situated at Iqbalpur Village, R/M Khanapur, Dist. Nirmal.

// Published as per orders Dated 24-7-2025 of the Hon'ble Senior Civil Judge at Nirmal //
Sd/- B.SHUBHAKARAN B.Sc., LL.B.,
Government Pleader, Principal District Judge Court, Nirmal Dist.-504106 (TG)

NOTICE OF THE DAY FIXED FOR SETTLING A SALE PROCLAMATION
(Order XXI, Rule 66 of C.P.C.)
IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT NIRMAL
E.P.NO.18 OF 2022 IN O.S.NO.39 OF 2014

Between:
Brahmarouthu Narsaiah ...D.Hr.
AND
Keerthi Narsaiah ...J.Drs.
To
J.Dr. No.3: Keerthi Vijender S/o. Narsaiah, Aged about 36 Years, Occ: Private Employee, R/o.H.No.20-137, 20-138, 20-139, 20-140, Shanthinagar, Khanapur, Village and Mandal, Dist. Nirmal.
J.Dr. No.4: Keerthi Pavani D/o. Keerthi Narsaiah, Aged about 32 Years, Occ: Student, R/o.H.No.20-137, 20-138, 20-139, 20-140, Shanthinagar, Khanapur, Village and Mandal, Dist. Nirmal.

WHEREAS in the above named suit Brahmarouthu Narsaiah S/o. Limbaiah alias Limbagiri, aged about 72 years, Occ: Retired Employee, R/o. 19-63, Vidyanagar, Khanapur, Dist. Nirmal, the Decree Holder, has applied for the sale of the properties mentioned in the schedule. You are hereby informed that the **11th day of August 2025** has been fixed for stting the terms of the proclamation of sale.

SHEDULE OF IMMOVABLE PROPERTIES OF J.Dr
Residential House with open space bearing No.1-101, admeasuring 22X80=5520.00 Sft = 613.33 Sq.Yards =512.80 Sq.Mtrs consisting with 1512.00 Sft Bangalore tiled roof situated at Tharlapad Village of Khanapur Mandal, Dist. Nirmal.

// Published as per orders Dated 24-7-2025 of the Hon'ble Senior Civil Judge at Nirmal //
Sd/- B.SHUBHAKARAN B.Sc., LL.B.,
Government Pleader, Principal District Judge Court, Nirmal Dist.-504106 (TG)



పొలంలోకి బయలుదేరిన మహిళలు





పత్తి చేనులో దౌరా కొడుతున్న రైతులు

ఫొటో న్యూస్

పొలం బాట.. బతుకు వేట

ఆదిలాబాద్ జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో అన్నదాతలు పొలం బాట పట్టారు. ఉదయమే అరక కట్టి చద్ది మూట చేత పట్టి చలో చలో మని పొలాలకు పరుగులు పెడుతున్నారు. కొందరు కలుపు తీయగా మరికొందరు ఎరువులు పట్టిస్తున్నారు. పంట ఏపుగా పెరిగే కీలక దశ కావడంతో అన్నదాతలు సమయానుకూలంగా పంట రక్షణ పద్ధతులు పాటిస్తున్నారు. జిల్లాలోని పంట పొలాలన్నీ రైతులు, వ్యవసాయ కూలీలతో సందడిగా కనిపిస్తున్నాయి.

● ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



కలుపు మొక్కలు ఏరేస్తున్న మహిళా రైతు కూలీలు



పత్తికి యూరియా వేస్తున్న రైతు



నవధాన్యాలతో చేసిన బతుకమ్మలతో యువతులు

లంబాడా గిరిజనుల.. కట్టుబొట్టు, సంస్కృతీ సంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తోంది. గిరిజనుల ఆచారాలు, పండుగలు, సంప్రదాయాలు ప్రత్యేకంగా ఉంటాయి. వారు నిర్వహించుకునే ప్రతి పండుగకూ ఓ ప్రత్యేకత ఉంటుంది. తెలంగాణలోని ప్రతి ఏడాది శ్రావణమాసంలో వర్షాలు ప్రారంభం అయ్యాక తీజ్ పండుగను జరుపుకొంటారు. గిరిజన వేడుకల్లో తీజ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. బంజారుల సంస్కృతిని కాపాడుతూ ప్రకృతిని ఆరాధించే పచ్చటి మొలకల పండుగ సందడి తండాలు, గ్రామాల్లో ప్రారంభమైంది. లంబాడీ భాషలో తీజ్ అంటే ఎర్రని ఆరుద్ర, వారు అనే అర్థాలు ఉన్నాయి. సీత్లా భవానీ వేడుకలు ముగించుకున్న అనంతరం బంజారాలు తమదైన పద్ధతిలో పండుగను జరుపుకొంటారు. అవివాహిత యువతులు, బాలికలు నిష్టతో తొమ్మిది రోజులు ఉపవాస దీక్షలు చేస్తారు.

● నేరడిగొండ

తీజోత్సవం..

- ప్రారంభమైన గిరిజనుల తీజ్ వేడుకలు
- శ్రావణంలో నెలంతా తండాల్లో సంబురాలు
- ఆచారాన్ని కొనసాగిస్తున్న లంబాడాలు
- తొమ్మిది రోజుల పాటు నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు
- చెరువులు, వాగుల్లో పచ్చటి నారు బుట్టల నిమజ్జనం
- పెళ్లికాని యువతులకు ప్రత్యేకం

చిరు జల్లులు కురుస్తుండగా, ఏరువాక ముందుకు సాగే సమయంలో శ్రావణంలో తండాల్లో తీజ్ ప్రారంభం అవుతుంది. గ్రామ పెద్దల అనుమతితో ఓ మంచి రోజున పండుగను ప్రారంభిస్తారు. భక్తి పారవశ్యంతో ఈ వేడుకలను నిర్వహిస్తుంటారు. గిరిజన తండాల్లో యువతీ, యువకులు ఆట పాటలతో తొమ్మిది రోజుల పాటు జరుపుకొనే తీజ్ ఉత్సవాల్లో ఎక్కడ చూసినా సందడే కనిపిస్తుంది. వందల ఏళ్ల నుంచి వస్తున్న ఆచార, సంప్రదాయాలు, సంస్కృతిని గిరిజనులు కాపాడుకునే క్రమంలోనే ఈ పచ్చటి పండుగకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. గిరిజన తండాల్లో శుక్రవారం నుంచి మొదలై నెల రోజుల్లో ఎప్పుడైన తొమ్మిది రోజుల పాటు (మిగతా 6లో..)

సండే స్పెషల్



పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్(ఫైల్)



నారు బుట్టలతో తరలి వెళ్తున్న లంబాడాలు(ఫైల్)

సీఆర్టీల పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి : పీవో

ఉట్నూర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొమురంలో ఆదివారం జరగనున్న సీఆర్టీల అర్హత పరీక్ష పారదర్శకంగా నిర్వహించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కొమురంభీం కాంప్లెక్స్‌లో ఉన్న సమావేశ మందిరంలో ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, ఎస్‌డీసీ గంగాధర్, డీడీ జాదవ్‌అంబాజి, ఏపీఓ, పీవీటీజీ మేస్రం మనోహర్, పీహెచ్‌ఓ సందీప్‌కుమార్, ఏసీఎంఓ జగన్‌లతో కలిసి ఆదివారం జరిగే సీఆర్టీ అర్హత పరీక్షపై ఇన్విజిలేటర్స్ చీఫ్ స్పెషల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఆర్టీ అర్హత పరీక్ష హాజరగు విద్యార్థులు ఉదయం 10గంటలకు కేబీ కాంప్లెక్స్ నందలి పరీక్ష కేంద్రాలకు ముందుగా ఉండాలని పలు సూచనలు చేశారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఓటర్ ఐడీ, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఏదైనా ఒక దానిని చూపాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

● 31 పోస్టులకు 3806 దరఖాస్తులు

ఉట్నూర్: ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో అవసరం మేరకు కాంట్రాక్ట్ రెసిడెన్సీ టీచర్ల(సీఆర్టీ) భర్తీ కోసం అధికారులు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు కోరారు. దరఖాస్తుల చివరి తేదీ నాటికి ముగిసిపోగా ఉమ్మడి జిల్లాలో ఉన్న 31 పోస్టులకు 3,806 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. పోస్టులు తక్కువే అయినా గిరిజన నిరుద్యోగులు ఎక్కువగా దరఖాస్తులు సమర్పించుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో కేవలం 17 పోస్టులు ఉండగా 2,156 మంది నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారు.

● ఆర్టీసీ ప్రత్యేక బస్సుల ఏర్పాటు

ఆదిలాబాద్ టౌన్: ఈనెల 27న వివిధ పరీక్షలకు హాజరు కానున్న అభ్యర్థుల సౌకర్యార్థం ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆదిలాబాద్ డిపో మేనేజర్ జి.ప్రతిమ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉపాధ్యాయుల నియామకం పరీక్షతోపాటు.. కాంట్రాక్ట్ జీపీఓ పరీక్షకు హాజరు కానున్న పదమూడు వేల మంది అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా వివిధ మండలాల నుంచి జిల్లా కేంద్రానికి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని.. ఆర్టీసీని ఆదరించాలని కోరారు.



పల్లె పోరుపై.. గురి!

- ప్రభుత్వ ప్రకటనతో స్థానిక సంస్థల ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి
- అప్రమత్తమవుతున్న ప్రధాన రాజకీయ పార్టీలు
- రిజర్వేషన్ల ఖరారుపై అంతటా ఉత్కంఠ
- ఎన్నికల్లో గెలుపునకు సన్నద్ధమవుతున్న నేతలు

ఆదిలాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనతో పల్లెపోరు పై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడుతు వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడం ఖాయమని తేలిపోయింది. ఎందుకంటే సెప్టెంబరు 30లోగా లోకల్‌బాడీ ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో ఈసారి ఎన్నికలను నిర్వహించడం ఖాయంగానే కనిపిస్తుంది. గత రెండేళ్ల క్రితమే స్థానిక సంస్థల పదవీ కాలం ముగిసి పోవడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిస్తుంది. గ్రామాల్లో



ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు ప్రజల దరికి చేరడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. జిల్లాలో 473 గ్రామ పంచాయతీలతో పాటు 166 ఎంపీటీసీ స్థానాలు 20జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఇక ప్రభుత్వం ముహూర్తాన్ని ఖరారు చేస్తే నోటిఫికేషన్ వెలువడే అవకాశం కనిపిస్తుంది.

రిజర్వేషన్ కలిసివస్తే పోటీ పక్కా..

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న ఆశావాహ నేతల్లో ప్రధానంగా రిజర్వేషన్ల పైననే తీవ్రమైన ఉత్కంఠ కనిపిస్తుంది. ప్రస్తుతం గ్రామాల్లో ఏ నలుగురు కలిసినా రిజర్వేషన్ల గురించి మాట్లాడుకోవడమే కనిపిస్తుంది. గత ప్రభుత్వ హయాంలో పదేళ్ల పాటు ఒకే రిజర్వేషన్ ఉంటుందన్న నిబంధన తీసుకొచ్చారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టతను ఇవ్వడం లేదు. దీంతో ఆశావహ నేతల్లో అయోమయం కనిపిస్తుంది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న ఈసారి రిజర్వేషన్ కలిసి వస్తుందో రాదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిజర్వేషన్ కలిసి వస్తే పోటీ చేయడం ఖాయమన్న ఉద్దేశంతో నేతలు కనిపిస్తున్నారు. అయితే గతంలో ఉన్న రిజర్వేషన్లనే యధావిధిగా కొనసాగిస్తారా? లేక ఏమైనా



మార్పులు చేర్పులు చేస్తారా? అనేది దానిపై సర్వత్రా ఆసక్తి కనిపిస్తుంది.

పట్టుతో ప్రధాన పార్టీలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈసారి ఎలాగైనా గెలిచి తీరాల్సిందేనని పార్టీ శ్రేణులకు నేతలు దిశా నిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికే నియోజక వర్గాలు, మండలాల వారీగా ముఖ్య నేతలతో సమీక్ష సమావేశాలను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మేజర్ గ్రామ పంచాయతీలు మండలాలపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. జిల్లాలో కొత్తగా ఏర్పడిన సోనాల, బోరజ్, సాత్నాల మండలాలపై ప్రత్యేకంగా సమీక్షిస్తున్నారు. ఇక్కడ సరైన నాయకత్వం కోసం పార్టీలు దృష్టి సారిస్తున్నాయి. బలమైన సామాజిక వర్గాలకు చెందిన నేతలను బరిలోకి దింపేందుకు సిద్ధమవుతున్నాయి. స్థానిక సంస్థల

(తరువాయి 6వ పేజీలో...)

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నాణ్యతగా చేపట్టాలి : ఈశ్వరయ్య

ఉట్నూర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టేలా లబ్ధిదారులు అధికారులకు కృషి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కన్సల్టెంట్ ఈశ్వరయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తాపీ మేస్త్రీలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ముడి సరుకులు అందించే వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఇందిరమ్మ ఇంటికి రూ.5లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నందున లబ్ధిదారులకు ఎలాంటి ఖర్చు లేకుండా ఇళ్లు నిర్మించాలన్నారు. ఉట్నూర్ మండలంలో ఇసుక రీచ్లు అందుబాటులో లేనందున జేల, జైనత్ ఇసుక రీచుల నుంచి ఇసుక ఉచితంగా అందిస్తామని లబ్ధిదారులు తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఇందులో ఎంపీడీఓ రాంప్రసాద్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మండల పంచాయతీ అధికారి సుదర్శన్‌రెడ్డి, హౌజింగ్ డిప్యూటీ ఎంఎ షాకిర్, ఏఈ నసీర్, ఉట్నూర్ పంచాయతీ ఈవో శంకర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ మొదటి శనివారం పూజలు

తాంసి, జూలై 26(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో ప్రారంభమైన మొదటి శనివారం సందర్భంగా మండలంలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వడ్డాది, గ్రామంలో వెలసిన నరసింహ స్వామికి వందలాది మంది భక్తులు తరలివెళ్లి ప్రత్యేకత పూజలు నిర్వహించారు. కప్పర్ల గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు గ్రామస్థులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే కప్పర్ల, తాంసి, పొన్నారి, మండల నాగపూర్, జామిడి గ్రామాలలో కూడా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. పాలోడి గ్రామ సమీపంలో ఉన్న రాముల గుట్ట వద్ద కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.



ఆలయ ప్రాంగణంలో పూజలు చేస్తున్న భక్తులు



అమరవీరుల స్తూపం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

సైనికుల త్యాగాలు చిరస్మరణీయం

● కార్గిల్ దివస్‌ను పురస్కరించుకుని ఘన నివాళ్లర్పించిన కలెక్టర్, ప్రజాప్రతినిధులు

ఆదిలాబాద్ టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మాతృభూమి రక్షణ కోసం శత్రు దేశాలతో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వీర జవాన్‌ల త్యాగాలు మరువలేనివని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కార్గిల్ దివస్‌ను పురస్కరించుకొని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గల కార్గిల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమర వీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి.. ఘనంగా నివాళ్లు సమర్పించారు. దేశ రక్షణలో సైనికుల త్యాగ నిరతిని గుర్తు చేసుకుంటూ వారి సేవలను కొనియాడారు. ఎన్‌సీసీ కాడేట్‌లు సైతం అమరవీరుల స్తూపం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు పాల్గొన్నారు.

అలాగే, కార్గిల్ విజయ దివస్ సందర్భంగా శనివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని కార్గిల్ పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద బీజేపీ పార్టీ శ్రేణులు, మాజీ సైనికులతో కలిసి అమరవీరులకు నివాళులర్పించారు. ఎమ్మెల్యే పాయల శంకర్ బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానందం, నేతలు ఆకుల ప్రవీణ్, లాలా మున్నా, వేదవ్యాస్, జోగురవి, దినేష్ మాటోలియా, గండే కృష్ణ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద అమరవీరుల స్తూపం వద్ద ఎన్‌సీసీ 32 బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ అరవిందకుమార్, సనాతన హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు, తదితరులు ఘన నివాళులర్పించారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- వర్షంలో సైతం హాజరైన యువత
- జాబ్‌మేళాకు విశేష స్పందన

ఇచ్చోడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేస్తోందని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలో రాయల్‌గార్డెన్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన మహాజాబ్ మేళాలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ జాన్సన్ భుక్యనాయక్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఆదిలాబాద్ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ బోథ్ నియోజక వర్గంలోని మొదటి సారి భారీ ఎత్తున జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

హైదరాబాద్ నుంచి వచ్చిన 62 కంపెనీ ప్రతినిధులు వారి కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చారన్నారు. యువతీ, యువకులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. గత ప్రభుత్వం యువతకు అండగా నిలిచిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారిపై పట్టింపు లేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి తల్లిదండ్రులు వారి కుటుంబ సభ్యుల ముఖంలో ఆనందం చూడడమే ఈ జాబ్‌మేళా యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగులకు అండగా నిలిచేందుకు కార్యక్రమం చేపట్టడం ఎంతో అభినందనీయమని అన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటి జాడ లేదన్నారు. నియోజకవర్గ, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పార్టీ కన్వీనర్ కృష్ణారెడ్డి, పాండురంగ్, సుభాష్, దేవేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



హాజరైన యువతీ, యువకులు, నియోజకవర్గ నాయకులు